పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, ఎంటమాలజీ సిబ్బందికి పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం చివరి రోజు మూసాపేటలోని పర్వత్‌నగర్, మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ వైద్యులకు, సిబ్బందికి సన్మానం చేశారు. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమంలో 2400 మంది కార్మికులు పాల్గొన్నారని, 1030 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐఎన్ నుంచి వచ్చిన అధికారులు, ఈఎస్ఐ వైద్యులు, ఉప కమిషనర్‌లు రమేష్, కార్తీక్, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, జామీల్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన బిల్డర్స్ అసోసియేషన్


జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని బుధవారం ఎస్ఏఆర్ఈడీసీ వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ సుభాష్ బాబు, ఈసీ మెంబర్స్ నరేంద్రప్రసాద్, దుర్గారెడ్డి, మట్టా రమేష్, పవన్ నాయుడు, సుధీర్ బాబు, సభ్యులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం తగదు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. బుధవారం నిజాంపేట్ సర్వే నెంబరు 233/13లో కబ్జాకు గురైన 400 గజాల స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని బీజేపీ నాయకులు సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... గతంలో బీజేపీ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపి వేశారని, అయితే సదరు నిర్మాణదారులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి జీప్లస్–4 అనుమతులు పొంది యథేచ్ఛగా తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ఎంబరి ఆంజనేయులు, అరుణ్ రావు, ప్రసాద్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరం

సుభాష్‌నగర్: రాజ్యాంగం ద్వారా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని కోరుతూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 62వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బుధవారం సూరారంలోని బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... భారత రాజ్యాంగంపై చిన్ననాటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు జేమ్స్, అంజన్న, భాస్కర్, చైర్మన్ గట్టు అశోక్, హరికిరణ్ పటేల్, నర్సింహారెడ్డి, కరణ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్స్ పరీక్షలకు హాల్ టికెట్లు రెడీ

గ్రూప్–1 పరీక్షలకు 3 జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు మొదటి పరీక్షకు ఉపయోగించిన హాల్ టికెట్‌ను మిగిలిన 6 పరీక్షలకు (ఈ నెల 21 నుంచి 27 వరకు) ఉపయోగించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు గుర్తించబడిన 46 కేంద్రాలలో ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు.


- అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 1:30 గంటలకు మూసివేస్తారన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని కలెక్టర్ తెలిపారు.
- అభ్యర్థులు నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్–ఎరేజర్, హాల్ టికెట్‌పై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డ్‌ని మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలని సూచించారు.

రూ.749.15 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం


సమీక్ష నిర్వహిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: ఆస్తి పన్ను రూ.749.15 కోట్లు లక్ష్యంగా వంద శాతం వసూలు చేయాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.749.15 కోట్లు టార్గెట్ అని ఇప్పటి వరకు రూ.299.35 కోట్లు వసూలు చేశారని తెలిపారు. వేడుకలు, పండుగల సందర్భంగా సెలవు దినాలు రావడంతో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతి మందగించిందన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని డాకెట్లలో ఆస్తి పన్ను వసూలు ఆశాజనకంగా లేదని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు ఆర్సీపురం సర్కిళ్లలోని 34 డాకెట్లలో వసూళ్ల తీరును సమీక్షించారు. ఉప కమిషనర్లు, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్


స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు, సర్కిల్ ఉప వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని పార్కుల వద్ద ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని శానిటేషన్ విభాగం సిబ్బందికి సూచించారు. కాలనీవాసులు చెత్తను తడి, పొడిగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేసి కాలనీ పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను రోడ్డుపై వేసిన వారికి జరిమానాలు విధిస్తామని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్‌ను 21 రోజుల పాటు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ డైరెక్టర్లు వెంకట్‌రావు, సుబ్బారావు, నారాయణగౌడ్, శానిటరీ సూపర్‌వైజర్ వెంకట్, ఎస్ఆర్పీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనకు సిద్ధం

- సామాజిక సమగ్ర సర్వేకు యంత్రాంగం చర్యలు
- సర్వేతో జనాభా దామాషా ప్రకారం సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం
- 2 నెలల్లో పూర్తయ్యేలా కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో సమగ్ర కులగణన చేపట్టేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా మేడ్చల్ జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు.

బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపర్చనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

ప్రస్తుతం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుత మొత్తం జనాభాలో బీసీలు అధికంగా ఉంటారని తెలుస్తోంది. జిల్లాలో ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో రెండు నెలల పాటు జరిగే కుల గణన సర్వే కార్యక్రమంలో ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యూటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలు పెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.
- 2011జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం జనాభా 24,60,095 కాగా.. ఇందులో కుటుంబాల సంఖ్య (హౌజ్ హోల్డర్లు) 5,86,112 గా ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత 2014 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించిన సందర్భంగా జిల్లాలో మొత్తం జనాభా 28,05, 365 ఉండగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు) 7.69,313 గా ఉంది. 2011 నుంచి 2014 వరకు దాదాపు నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా జనాభా 3,45,270 పెరగగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు)1,71,201గా ఉంది.

2014లో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు ఇలా ఉన్నాయి.

	కుటుంబాల సంఖ్య	జనాభా
ఓసీ	2,96,379	10,62,969
బీసీ	3,43,326	12,63,522
ఎస్సీ	1,08,174	3,99,572
ఎస్టీ	21,434	79,302
	7,69,313	28,05,365

గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు

మోతీనగర్: బోరబండ, అల్లాపూర్‌లో మంగళవారం రాత్రి గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం మత సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్, జమీర్, కరీం, అబ్దుల్లా, మస్తాన్‌రెడ్డి, గౌస్, నజీర్, జహంగీర్ పాల్గొన్నారు.

18న టీహబ్‌లో జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఈనెల 18వ తేదీన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్(జీసీసీ) ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం 3:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, సైయింట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ తదితరులు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. కార్యక్రమంలో 50కిపైగా స్టార్టప్‌ల ప్రతినిధులు, 400పైగా వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి


సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసానిస్తోందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రాంగూడకు చెందిన భగవాన్‌దాస్ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా ఆయనకు మంజూరైన రూ.70వేల చెక్కును బుధవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మియాపూర్: ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ వనం సుధాకర్ పిలుపునిచ్చారు. మియాపూర్ కాలనీలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తొలిదశ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ హైదరాబాద్ కమిటీ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కమిటీ సెక్రటరీ సభ్యులు సుకన్య, గ్రేటర్ కార్యదర్శి వర్గ సభ్యులు కళావతి, అంగడి పుష్ప, మురళి, భాగ్యమ్మ, రాణి, సుల్తానా బేగం, శివాని తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల జట్టు ఎంపిక


సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ సెలక్షన్ ట్రయల్స్‌ను యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ ట్రయల్స్‌లో వివిధ కళాశాలల నుంచి సుమారు 150 మంది పాల్గొన్నారు. సెలక్షన్లను జేఎన్‌టీయూహెచ్ సెక్రటరీ, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా.నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు క్రైస్ట్ యూనివర్సిటీ బెంగళూరులో జరిగే సౌత్ జోన్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననుంది. కోచ్ అమృత్‌రాజ్ పర్యవేక్షణలో సెలక్షన్ జరిగింది. కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

నేడు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 17న ఘట్కేసర్ మండలంలోని ఏదులాబాద్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల లలిత కళల పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని గురువారం ఉదయం 9.30 గంటలకు సంబంధిత పాఠశాలలో రిపోర్ట్ చేసి, జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు.

'మనూ'లో ముగిసిన వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ పాఠ్య పుస్తకాల తయారీ బృహత్తర బాధ్యత అని మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), భారతీయ భాషా సమితి(బీబీఎస్) 'మనూ' సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉర్దూ రచయితల వర్క్‌షాప్ ముగింపు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ గుర్పాల్‌సింగ్, డెక్కన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ కంట్రోల్ ట్యాంక్ పొంగి కాలనీలోకి రావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించి జీహెచ్ఎంసీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాన్‌హోల్స్ అన్ని శుభ్రం చేయించి, నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని, కాలనీలో పెద్ద డ్రైనేజీ లైన్ నిర్మించి నీరు నిలిచేలా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మారెళ్ల శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లీకేజీతో తాగునీరు వృథా



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ అపార్ట్‌మెంట్ సొసైటీ భవన సమీపంలో మంచినీటి పైప్ లైన్ వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. స్థానికంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ కూడా ఉండటంతో మురుగునీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఉదయం నుంచి నీరు రోడ్లపై ఏరులై పారుతోందని వాటర్‌వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా వాల్వ్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పోచమ్మ ఆలయంలో చండీ హోమం


పోచమ్మ తల్లి


హోమంలో పాల్గొన్న భక్తులు

మూసాపేట: మూసాపేట భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో బుధవారం చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, చండీ హోమం, రుద్ర హోమం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు కాలనీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు.

పుస్తక నిక్షిప్త కేంద్రం తెరవరు..
డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయరు


11 ఏళ్ల క్రితం వేసిన శిలాఫలకం ఇదే..


రాయదుర్గంలో పుస్తక నిక్షిప్త కేంద్రం ఏర్పాటు చేసిన భవనం

రాయదుర్గం: పుస్తక నిక్షిప్త కేంద్రంపై ఆశలు వదులుకోగా... డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కూడా పత్తా లేకుండా పోయింది.హైటెక్ డివిజన్‌గా పేరొందిన గచ్చిబౌలిలో కనీసం లైబ్రరీ లేకపోవడం, ఆ తర్వాత ఏర్పాటు చేస్తామన్న డిజిటల్ లైబ్రరీ విషయం కూడా అందరూ మరిచి పోయినట్టుందని యువత, విద్యావేత్తలు, విద్యార్థులు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో పుస్తక పఠనంపై అందరిలోనూ ఆసక్తి కనబడుతోంది. ఈ నేపథ్యంలో వీటిపై జీహెచ్ఎంసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ రెండూ దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటు చేసిన రెండేళ్లకే మూత

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఇందిరాగాంధీ పుస్తక నిక్షిప్త కేంద్రం (బుక్ డిపాజిట్ సెంటర్)ను 13 అక్టోబర్, 2013లో ఏర్పాటు చేశారు. రెండేళ్లపాటు ఇది బాగా నడిచింది. దినపత్రికలు, గ్రంథాలు, పుస్తకాలు చదివేందుకు చాలామంది ఆసక్తి కనబర్చారు. కానీ ఆ తర్వాత నిర్వహణ భారం కారణంగా రెండేళ్ల తర్వాత మూసివేశారు. మళ్లీ పుస్తక నిక్షిప్త కేంద్రం రూపంలో లైబ్రరీని ఏర్పాటు చేయాలనే దానిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి దృష్టి పెట్టలేదు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని బుక్ డిపాజిట్ సెంటర్లతోపాటు పేపర్ రీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ లైబ్రరీ

జీహెచ్ఎంసీ ద్వారా నాలుగేళ్ల క్రితం డివిజన్‌కు ఒక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఆ తర్వాత కొన్నిచోట్ల స్థలాలు, భవనాలను పరిశీలించినా.. వీటి ఏర్పాటుపై ఆసక్తి చూపలేదు. డిజిటల్ లిటరసీని పెంచేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు, భారీ అపార్ట్‌మెంట్లు, జీపీఆర్ఏ క్వార్టర్స్ (కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయం), టీఎన్‌జీఓ కాలనీ, సెక్రెటేరియట్ కాలనీలలో ఏర్పాటు చేయాల్సిన అవసరముందంటున్నారు.ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు.